క్లుప్తంగా

శారదాధామంలో స్పేస్ ఆన్ వీల్స్ అవగాహన



శారదాధామంలో స్పేస్ ఆన్ వీల్స్ అవగాహనలో విద్యార్థులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శారదాధామంలో విద్యార్థులకు స్పేస్ ఆన్ వీల్స్ రూపంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతరిక్ష విజ్ఞానం రోజు రోజుకు ఆలోచన శక్తి పెరుగుతుందని, ఆలోచన విస్తృతమైందని, అందరినీ ఆలోచింపజేస్తుందన్నారు.రాబోయే తరం వైజ్ఞానికులుగా ఎదగాలని వారిలో చక్కటి జిజ్ఞాసను కలిగించిందన్నారు. విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానం మీద చక్కటి అవగాహన కల్పించడానికి ఇస్రో రూపకల్పన స్పేస్ ఆన్ వీల్స్ నిలిచిందన్నారు.

గ్రూప్-2,3లో మహిళా అభ్యర్థులకు అన్యాయం జరగకుండా చూడాలి



సబితాఇంద్రారెడ్డిని కలిసిన దాసరి ఉషా

మైలార్‌దేవ్‌పల్లి: గ్రూప్-2, 3 మహిళా నియామకాల్లో చోటు చేసుకున్న అవకతవకలపై చర్చించేందుకు పెద్దపల్లి నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే దాసరి ఉషా బుధవారం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియామక ప్రక్రియలో పారదర్శకత లోపించిన అంశాలను మాజీ మంత్రికి వివరించారు. మహిళలకు అన్యాయం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వెంకటేష్, కొంపల్లి జగదీష్, యాదగిరి, భాస్కర్, మల్లేష్ ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు



కాలిపోయిన విద్యుత్ బాక్స్

రాజేంద్రనగర్: షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇంట్లో మంటలు చెలరేగిన ఘటన రాజేంద్రనగర్ హైదర్‌గూడలో బుధవారం చోటు చేసుకుంది. రాజేంద్రనగర్ హైదర్‌గూడకు చెందిన హనుమంత్‌రావు ఇంట్లో బుధవారం షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కుటుంబ సభ్యులంతా బయటికి పరుగులు తీశారు. స్థానికులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు.

తాళాలు పగులగొట్టి చోరీ

రాజేంద్రనగర్: బంధువుల ఇంటికి వెళ్లొచ్చేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి తులంన్నర బంగారు ఆభరణాలు, రూ.5 వేల నగదును ఎత్తుకెళ్లిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఉప్పర్‌పల్లి ప్రాంతానికి చెందిన అనిత మంగళవారం రాత్రి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. ఉదయం వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలగొట్టి ఉండి ఉన్నాయి. అల్మారా పరిశీలించగా అందులో దాచిన రూ.5 వేల నగదు, తులంన్నర బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నియామకం



నియామకపత్రం అందుకుంటున్న కృష్ణమూర్తి

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షులుగా పుప్పాల కృష్ణమూర్తి నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం రాష్ట్ర అధ్యక్షులు ప్రీతం కుమార్, ఉపాధ్యక్షులు జల్లిపల్లి నరేంద్ర, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షులు పెంటయ్య చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లోని ఎస్సీల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. అత్తాపూర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పాటు పడుతానన్నారు.

ఉద్యోగుల కాలనీ.. సమస్యలే అన్నీ..

ఇదీ రంగారెడ్డిజిల్లా టీఎన్‌జీఓ కాలనీ దుస్థితి

రాయదుర్గం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులు, అమలు చేసే సంక్షేమ పథకాలు విజయవంతం చేయడంలో ముఖ్యభూమిక పోషించే ప్రభుత్వ ఉద్యోగులు నివాసముండే కాలనీలో సమస్యలు నెలకొన్నాయి. రంగారెడ్డిజిల్లా పరిధిలో పని చేసే ప్రభుత్వ ఉద్యోగులు నివాసం ఉండే టీఎన్‌జీ కాలనీ గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాన్ని ఆనుకునే ఉంటుంది. రంగారెడ్డి జిల్లా ఉద్యోగులంతా ఒకచోట ఉండేలా వారికి ఇళ్ల స్థలాలు కేటాయించగా ఇప్పటి వరకు 500 ఇళ్ళు కట్టుకున్నారు. కాలనీ సమస్యలు తీర్చాలని కాలనీ సంక్షేమ సంఘం ద్వారా ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు సమర్పించగా కొన్ని అభివృద్ధి పనులు చేపట్టారు. కాలనీలోని ప్రధాన, అంతర్గతరోడ్ల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ, చెరువు సుందరీకరణ, వీధిదీపాలు, పార్కులను అభివృద్ధి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సమస్యలు ఇవే..

- కాలనీలో పలుచోట్ల ప్రధాన, అంతర్గత రోడ్లపై



ముష్కి చెరువు కట్ట



టీఎన్‌జీఓకాలనీ రంగారెడ్డిజిల్లా ప్రాంతంలో రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు

డ్రైనేజీ పారుతోంది. వాహనాలు, పాదచారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి.

- ప్రధాన రోడ్డులో పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. మురుగునీరు రోడ్డుపై పారుతుండడంతో ఎక్కడ గుంతలు ఉన్నాయో.. తెలియని పరిస్థితి నెలకొంది. రోడ్ల విషయం పలుమార్లు అధికారుల దృష్టికి తెచ్చినా ఫలితం లేదు
- కాలనీకి చేరువలోనే సెక్షన్ ఆఫీస్ ఉన్నా, కాలనీలో నీటి సమస్య నెలకొంది. కాలనీలో రోజు రోజుకూ ఇళ్ల సంఖ్య పెరిగిపోతుండడంతో మంచి నీటి కనెక్షన్ల సంఖ్య పెరుగుతూ పోతోంది. దీంతో సరిపడా నీటి సరఫరా జరగడం లేదని స్థానికులు వాపోతున్నారు.
- టీఎన్‌జీ కాలనీలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోర్లు పనిచేయడం లేదు. అందరూ



గుంతలమయంగా రోడ్డు

నీటి ట్యాంకర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి

- కాలనీ చెంతనే రూ.50 లక్షలతో మోడల్ మార్కెట్ నిర్మించి 8 ఏళ్ళు గడుస్తున్నా ఇప్పటి వరకు అందుబాటులోకి రాలేదు.
- కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులు జూన్ 2023లో మొదలు పెట్టారు. రెండేళ్ళు గడుస్తున్నా పనులు ఇంకా పూర్తి కాలేదు.
- కాలనీలో ఉండే ముష్కి చెరువు సుందరీకరణ చేపట్ట లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కాలనీని ఆదర్శంగా మార్చాలన్నదే లక్ష్యం



టీఎస్‌జీఓకాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో వెల్ఫేర్ సొసైటీ పనిచేస్తోంది. పూర్తి స్థాయి మౌలిక వసతులు దశలవారీగా కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. కాలనీలో 500 ఇళ్లు ఉన్నాయి. నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి.

– జంగయ్య, రంగారెడ్డిజిల్లా
టీఎన్‌జీఓస్ హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు

వసతులు లేక ఇబ్బందులు



కాలనీ ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తి స్థాయి మౌలిక వసతులు లేవు. చెరువు సుందరీకరణ, డ్రైనేజీ, మంచినీటి సరఫరా ఇలా ఇక్కట్లు పడుతున్నాం. ప్రభుత్వ ఉద్యోగులు, పదవీ విరమణ చేసినవారే ఇక్కడ నివాసముంటున్నారు. వారికి సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి.

– జోసఫ్, రంగారెడ్డిజిల్లా
టీఎన్‌జీఓస్ హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి

ముష్కి చెరువును పరిరక్షిస్తాం



చెరువును పరిశీలిస్తున్న అధికారులు

మణికొండ: చెరువులను పూర్తిస్థాయిలో సంరక్షిస్తామని ఇరిగేషన్ డీఈ రమాదేవి, జలమండలి ట్రాన్స్‌మిషన్ జీఎం రాజు, మణికొండ మున్సిపాలిటీ డీఈ శివసాయిలు అన్నారు. మైహోం అవతార్, హాల్‌మార్క్ వినిసియా నివాసితులు ముష్కి చెరువు వద్ద ఓ సంస్థ ప్రతినిధులు నిబంధనలు ఉల్లంఘించి చేస్తున్న పనులపై స్థానిక ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అదే విషయం పత్రికల్లో కథనాలు రావటంతో స్పందించిన అధికారుల బృందం బుధవారం చెరువు పరిసరాలు, అందులో కలుస్తున్న మురికి నీటిని పరిశీలించారు. ఎఫ్‌టీఎల్ కుంచించుకుపోయేలా మట్టి కట్టలు పోయటం, ఎప్పటి నుంచో ఉన్న పెద్ద చెట్లను కొట్టి వేయటం, మురికి నీటిని చెరువులోకి మళ్లించటం నేరమన్నారు. తమ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇలాంటి పనులు ఎలా చేపట్టారని సంస్థ ప్రతినిధులను ప్రశ్నించారు. త్వరలోనే చెరువు చుట్టూ పోసిన మట్టిని తొలగిస్తామని, మురుగు నీటిని చెరువులో కలువకుండా మళ్లిస్తామన్నారు.

శ్రీరాంనగర్ అభివృద్ధికి కృషిచేస్తాం



ప్రమాణస్వీకారం చేసిన నూతన కమిటీ సభ్యులు

మణికొండ: శ్రీరాంనగర్(సెక్రటేరియట్) కాలనీని అన్ని రంగాలలో అభివృద్ధికి కృషి చేస్తామని అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ అన్నారు. బుధవారం కాలనీ నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మణికొండ మున్సిపాలిటీలో పెద్ద కాలనీల్లో ఒకటిగా శ్రీరాంనగర్ కాలనీ ఉందని ఇప్పటికే అనేక రంగాల్లో అభివృద్ధి చెందిందని, రాబోయే రోజుల్లో పందెన్‌వాగు అభివృద్ధి, ఉన్న స్థలాల్లో పార్కుల అభివృద్ధి పారిశుద్ధ్యం, ట్రాఫిక్, వీధి దీపాలు, సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బి. శివరామకృష్ణ, నవీన్, రవికుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి విజయ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి పి.సుజాతతో పాటు కార్యకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజావసర మార్గాల్లో బస్సులు నడపండి

మణికొండ: ప్రజావసరాలకు తగ్గట్టుగా ఆయా మార్గాల్లోనే బస్సులను పడిపితే వారితో పాటు ఆర్టీసీకి ప్రయోజనం కలుగుతుందని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ నాయకులు ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను కోరారు. బుధవారం వారు ఆయనను కలిసి మణికొండ ప్రజలకు అవసరమైన రూట్ల విషయంలో చర్చించి వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలో అత్యధిక ప్రజలు ఐటీ ఉద్యోగులని వారు ప్రతి రోజు నానక్‌రాంగూడ, మైండ్స్ స్పేస్ రూట్లలో సొంత వాహనాలలో ప్రయాణిస్తున్నారన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్ నుంచి ఆయా రూట్లలో ఏసీ బస్సులను నడిపితే వారికి ఎంతో ప్రయోజనంగా ఉండి సొంత వాహనాలను పక్కనపెట్టి బస్సుల్లోనే ప్రయాణిస్తారన్నారు. మున్సిపాలిటీ ప్రజలు ఎయిర్‌పోర్ట్, మెట్రో ద్వారా ప్రయాణించాలంటే సరైన కనెక్టివిటీ బస్సులు లేవన్నారు. మణికొండ నుంచి ఎయిర్‌పోర్టుకు బస్సుల నడిపితే ఎంతో మందికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. మణికొండ మర్రిచెట్టు వరకు నడుపుతున్న 49 బస్సులను చిత్రపురి కాలనీ వరకు పొడగిస్తే ఫిలింనగర్ వెళ్లే వారికి సౌకర్యంగా ఉంటుందన్నారు. వినతి ఇచ్చిన వారిలో రాజశేఖర్, డాక్టర్ పి.అవినాష్, మహేంద్రచారి, చల్మారెడ్డి ఉన్నారు.



సజ్జనార్‌ను కలిసిన ఫెడరేషన్ నాయకులు

సీసీ రోడ్డు పనుల పరిశీలన

బండ్లగూడ: అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా సకాలంలో పూర్తి చేయాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోకరి సురేష్‌గౌడ్ అన్నారు. 18వ డివిజన్ ఆనంద్ ఎన్‌క్లేవ్‌లో నూతన సీసీ రోడ్డు పనులను ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. బస్తీలు, కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలన్నారు. తమ తమ ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పర్యవేక్షిస్తూ నాణ్యత లోపాలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు.

ఫిరంగి నాలా కంపు భరింలేకపోతున్నాం

సీఎం కార్యాలయంలో ఫిర్యాదు

శంషాబాద్: ఫిరంగి నాలాలలో ఉన్న మురుగు నీటి దుర్గంధంతో పాటు దోమల విజృంభణతో భరించలేకపోతున్నామని శంషాబాద్ మున్సిపాలిటీలోని మిషన్ కంపౌండ్ కాలనీ వాసులు బుధవారం సీఎం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నిబంధనలను విరుద్ధంగా నాలా పక్కనే నిర్మాణం చేస్తున్న భవంతుల డ్రైనేజీ మొత్తం నాలాలోనే కలిపేస్తుండటంతో దుర్గంధంగా మారిందన్నారు. సమీపంలోనే ఓ ఆస్పత్రికి సంబంధించిన డ్రైనేజీతో పాటు ఆస్పత్రి వ్యర్థాలు కూడా పారబోస్తున్నారన్నారు. డ్రైనేజీ కాలువలు తీయడంతో కాలనీలోకి సరఫరా అయ్యే మంచి నీరు కూడా కలుషితమవుతుందన్నారు. సీఎం కార్యాలయంలో ఫిర్యాదు చేసిన అనంతరం వైద్యశాఖమంత్రి దామోదర రాజనర్సింహాకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. వినతి ఇచ్చిన వారిలో బీజే సామ్‌సన్, ప్రభాకర్, డానియల్, సుకేసిని కురుత్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శంషాబాద్: శంషాబాద పట్టణం సాతంరాయిలో ఉన్న మహాత్మా జ్యోతి బాపూలే వెనకబడిన తరగతుల సంక్షేమ డిగ్రీ కళాశాల (పురుషుల)లో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి పి.వెంకటేశ్వర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గణితం, జువాలజీ, లా, మేనేజ్‌మెంట్ సబ్జెక్టులో బోధించేందుకు యూజీసీ నిబంధనల మేరకు స్లెట్, నెట్, పీహెచ్‌డీ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9989269715, 9490955172 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు జగన్నాథ రతయాత్ర

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంనగర్ గోల్డన్ టెంపుల్ నుంచి స్కైలా గేటెడ్ కమ్యూనిటీ వరకు గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 వరకు జగన్నాథ రథయాత్రను నిర్వహిస్తున్నట్టు భక్తి కుటీర్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఇస్కాన్ అబిడ్స్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రథయాత్రకు ముఖ్య అథితిగా హెచ్‌జీ రాధేశ్యాందాస్ హాజరవుతున్నారని, రథయాత్ర ముగిసిన అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

నవ సమాజ నిర్మాణమే లక్ష్యంగా..

రాయదుర్గం: అసమానతలు లేని నవ సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు నడుద్దామని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ళ ఉపేందర్‌మాదిగ పేర్కొన్నారు. జూలై 7న ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో నాయకులు రాధనోళ్ళ వేణు అధ్యక్షతన బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పీడిత వర్గాలను ఏకం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డీఎస్‌యూ అధ్యక్షుడు ఉమేష్ అంబేద్కర్, ప్రధాన కార్యదర్శి శేఖర్, నాయకులు మనోజ్, శ్రీకాంత్, బిరోన్, అజయ్, ఆనంద్ పాల్గొన్నారు.

మరో విల్లా నేలమట్టం

చిత్రపురిలో ముగిసిన కూల్చివేతలు



మణికొండ: చిత్రపరిశ్రమలో కార్మికులు, నటులు, నిర్మాతలు, దర్శకుల కోసం నిర్మించిన చిత్రపురి కాలనీలో అనుమతుల కన్నా అధికంగా నిర్మించిన ఆరు విల్లాలను మణికొండ మున్సిపల్ అధికారులు నేల మట్టం చేశారు. గత సంవత్సరం నాలుగు విల్లాలు కూల్చివేయగా మరో ఇద్దరు కోర్టును ఆశ్రయించారు. దాంతో ఇటీవల కోర్టు అక్రమ నిర్మాణాలను తొలగించాల్సిందేనని ఆదేశించడంతో మంగళవారం రెండు విల్లాలను కూల్చివేతలకు పనులు మొదలు పెట్టిన టౌన్‌ప్లానింగ్ అధికారులు ఒకటి కూల్చి మరో దాని పనులు మొదలు పెడుతున్న క్రమంలో అందులో నివసిస్తున్న వారు అడ్డు తగిలిన విషయం తెలిసిందే. ఇంట్లోని సామగ్రిని తీసుకునేందుకు బుధవారం ఉదయం వరకు సమయం ఇచ్చిన టౌన్‌ప్లానింగ్ అధికారి సంతోష్‌సింగ్ బుధవారం ఉదయమే కూల్చివేత పనులను మొదలు పెట్టించారు. అప్పటికీ ఇంట్లో కొంత సామగ్రి ఉందని, దాన్ని తీసుకుంటున్నామని వేడుకోవటంతో మరో రెండు గంటల సమయం ఇచ్చారు. అనంతరం అదనపు ఆరో విల్లాను నేలమట్టం చేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తున్న 45 భవనాలను గుర్తించామని టౌన్‌ప్లానింగ్ అధికారి సంతోష్‌సింగ్ తెలిపారు. వాటికి నోటీసులు జారీ చేస్తున్నామన్నారు.

సమ్మేళనాన్ని విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: జూలై 4న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హైదరాబాద్ పర్యటన సందర్భంగా లాల్ బహదూర్ స్టేడియంలో గ్రామస్థాయి అధ్యక్షుల సమ్మేళనం నిర్వహిస్తున్నారని ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి అధ్యక్షతన మైలార్‌దేవ్‌పల్లిలోని ఎమ్మెల్యే నివాసంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. జై బాపు, భీమ్, జై సంవిధానం కార్యక్రమంలో భాగంగా ఈ సమ్మేళనం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

రాజేంద్రనగర్: ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయమని మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.నియోజకవర్గ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ఆర్‌జీకే పింక్ క్వార్టర్‌లో బుధవారం ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ తాగునీటి సమస్య ఉండేదని సమస్య పరిష్కారానికి నూతన టర్ పైపులైన్ వేయించామన్నారు. హౌసింగ్ బోర్డు సొసైటీకి సంబంధించిన ఆఫీసర్లతో చర్చించి మరోసారి ప్రజలకు పూర్తిస్థాయిలో మంచినీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జనార్దన్, తలారి చిన్న, బబ్లూ, మోహన్‌రెడ్డి, అంజమ్మ, అడికె శివ, రాజేష్, సచిన్, ఎన్ను శంకర్‌రెడ్డి, జలమండలి డీజీఎం రేణుకా, జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ భాను పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న శ్రీనివాస్‌రెడ్డి

సొంతూరికి జగిత్యాల వాసి మృతదేహం

శంషాబాద్: యుద్ధ నేపథ్యంలో ఇజ్రాయిల్‌లోని బంకర్‌లో శ్వాససరిపోక మృతిచెందిన జగిత్యాల పట్టణవాసి రేవెల్లె రవీందర్ (57) మృతదేహం బుధవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతిలక్ష్మణ్, ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన మందభీమ్‌రెడ్డి, మృతుడి కుటుంబ సభ్యులు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుని మృతదేహాన్ని సొంతూరికి పంపించారు. ఈ సందర్భంగా జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జ్యోతి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ చొరవతోనే ఇజ్రాయిల్ నుంచి మృతదేహం దేశానికి చేరుకుందన్నారు. గల్ఫ్ దేశాల్లో మృతిచెందిన కార్మికులకు ఇస్తున్నట్లుగానే రూ. 5 ఎక్స్‌గ్రేషియోను ఇజ్రాయిల్, మలేషియా, సింగపూర్‌లో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు కూడా ఇవ్వాలని కోరారు.



ఎయిర్‌పోర్టు కార్గో నుంచి మృతదేహాన్ని తీసుకెళ్తున్న దృశ్యం

కొనసాగుతున్న వారాహి నవరాత్రి ఉత్సవాలు



కొలువుదీరిన అమ్మవారు



పూజల్లో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్ కోట మైసమ్మ దేవాలయంలో వారాహి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ప్రతిరోజు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి నిర్వహించిన పూజలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

మాజీ ప్రియుడిపై కోపంతో
విమానాశ్రయాలకు బెదిరింపు మెయిల్స్

చెన్నైకి చెందిన యువతి అరెస్టు

శంషాబాద్: ఇటీవల విమానాశ్రయాలతో పాటు పలు స్టేడియాలకు బాంబుల బెదిరింపుల వరసగా మెయిల్స్ చేసిన ఘటనలో చెన్నైకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ (యువతి)ని అహ్మదాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చెన్నైకి చెందిన యువతి ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలో సీనియర్ మేనేజర్‌గా పనిచేస్తోంది. తన మాజీ ప్రియుడు వివాహానికి నిరాకరించిన కారణంతో అతని మెయిల్ ఐడీలను ఉపయోగించి గత నెలన్నరగా శంషాబాద్ విమానాశ్రయంతో పాటు అనేక విమానాశ్రయాలకు బాంబు బెదిరింపు ఈ మెయిల్స్‌ను వరసగా పంపింది. అంతేకాకుండా ఇటీవల జరిగిన అహ్మదాబాద్-లండన్ ఎయిర్‌ఇండియా ప్రమాదానికి సంబంధించిన కూడా మెయిల్ పంపడంతో పోలీసులు తీవ్రంగా గాలించి చెన్నైకి చెందిన యువతిని అరెస్ట్ చేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కూడా బాంబు బెదిరింపు మెయిల్స్ రావడంతో ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీసులు యువతిని అదుపులోకి తీసుకుని విచారించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

శుభాకాంక్షలు

శంషాబాద్: తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా నియమితులైన రామచంద్రరావును బుధవారం ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి విస్తృతంగా కృషి చేయాలని ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు సూచించారన్నారు.